
జలకళ పథకం కింద బోరు వేస్తున్న దృశ్యం (ఫైల్)

ఎంతో ఆశపడ్డాం..

వైఎస్సార్ జలకళ పథకం కింది మా పొలంలో ఎనిమిది నెలల క్రితం బోరు వేశారు. కానీ ఇంత వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. మోటారు ఇవ్వలేదు. సొంతంగా మోటారు కొనే స్తోమత లేదు. విద్యుత్ కనెక్షన్‌కూ రూ.లక్షల్లో ఖర్చవుతుంది. అందుకే ఏమీ చేయలేకపోయాము. బోరు వేసి ప్రయోజనం లేకుండాపోయింది.

- బాధిత రైతు, శింగనమల

- ఇప్పటి వరకూ తవ్విన బోర్లు 3,300 మాత్రమే
- ఉచిత విద్యుత్ కనెక్షన్, మోటార్లు ఉత్తిమాటే
- బోర్లు తవ్విన కాంట్రాక్టర్లకు రూ.8 కోట్ల బకాయి
- బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించిన బాధితులు



ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు
57,000



జలకళ తూచ్..!

రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తామని గత ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ హామీ ఇచ్చారు. ఈ పథకానికి 'వైఎస్సార్ జలకళ' అని గొప్పగా నామకరణం చేశారు. కానీ అధికారం లోకి వచ్చాక పథకం అమలు గందరగోళంగా సాగింది. రెండుమూడేళ్లపాటు దీని గురించి పట్టించుకోలేదు. ఆ తరువాత రైతుల నుంచి విమర్శలు రావడంతో దరఖాస్తులను ఆహ్వానించారు. తీవ్ర వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొనే జిల్లా రైతులకు ఉచిత బోర్లు వరంలాటివి. బోరుబావుల తవ్వకానికి రూ.లక్షలు వెచ్చిస్తారు ఇక్కడి రైతులు. అందుకే ఉచిత బోర్లు అనగానే ఎంతో ఆశతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. బోర్లను తవ్వే పనిని కాంట్రాక్టర్లకు అప్పగించారు. కానీ మార్గదర్శకాలు ఏమిటో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకూ అర్థం కాలేదు. బోర్లు, విద్యుత్ కనెక్షన్, మోటార్లు.. ఇలా చాలా అంశాల పట్ల ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జనం మధ్యలో స్వయంగా ఈ పథకం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లకే పథకాన్ని అటకెక్కించారు.

- శింగనమల/అనంతపురం క్లాక్‌టవర్


డ్వామా కార్యాలయంలో దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న వైఎస్సార్ జలకళ నమూనా

అధికారపార్టీ వారికే..

శింగనమల నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకానికి 2,956 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కొందరు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో నియోజవర్గంలో 500 బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. అందులో ఇప్పటి వరకూ 85 మంది రైతుల పొలాల్లో మాత్రమే బోర్లను తవ్వారు. వీటిలోనూ వైసీపీ సానుభూతిపరులకే ప్రాధాన్యం ఇచ్చారు. బోర్లు తవ్వించుకున్న రైతులకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తామని, ఉచిత మోటార్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత మోటారు, విద్యుత్ కనెక్షన్‌కు అయ్యే ఖర్చులో రూ.2 లక్షల వరకు ఇస్తాం, మిగిలింది రైతులే భరించాలని నాలుక మడత పెట్టారు. ఏదైతే అదికానీ అని రైతులు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదిస్తే.. ఉచిత కనెక్షన్ల గురించి తమకు ఎలాంటి ఉత్తర్వులు లేవని తేలిపోయారు. దీంతో రైతులు ఉసూరుమన్నారు. అంతో ఇంతో డబ్బున్న రైతులు సొంత ఖర్చులతో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. మొత్తం 85 బోర్లను తవ్వగా.. పది మంది రైతులు మాత్రమే విద్యుత్ కనెక్షన్, మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. బోర్లు తవ్విన కాంట్రాక్టర్లకు బిల్లులు కాలేదు. దీంతో ఆరునెలల క్రితం కాంట్రార్లు బోరు బావుల తవ్వకాలను నిలిపేశారు.

డబ్బులు కట్టమంటున్నారు..

ఉచితంగా బోరు వేసి, విద్యుత్ కనెక్షన్‌తోపాటు మోటారును కూడా ఉచితంగా ఇస్తామన్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్నాం. మా పొలంలో బోరు వేశారు. విద్యుత్ కనెక్షన్, మోటారు ఇవ్వలేదు. బోరుకు తప్ప మిగిలినవాటికి డబ్బు చెల్లించాలని అడుగుతున్నారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చేది..? అందుకే బోరు బావిని పూడ్చేయాలని అనుకుంటున్నాం.

- బాధిత రైతు, శింగనమల

రూ.8కోట్ల బకాయిలు

వైఎస్సార్ జలకళ బిల్లులను కాంట్రాక్టర్లకు రెండేళ్ల నుంచి చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. ఉమ్మడి జిల్లాలో రూ.8 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. ప్రభుత్వం పైసా చెల్లించలేదు. ప్రభుత్వం సూచించిన ధరల ప్రకారం, ఎంపికైన రైతుల పొలాల్లో కాంట్రాక్టర్లు బోరుబావులను తవ్వించారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు సంస్థలు ఈ పనులను చేపట్టాయి. ఒక్కో సంస్థకు రూ.2 కోట్ల ప్రకారం మొత్తం రూ.8 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏదో ఒకరోజు బిల్లులు వస్తాయని భావించి, డ్వామా అధికారులు చెప్పిన ప్రకారం బోర్లు తవ్వారు. ఉమ్మడి జిల్లాలో 57 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకూ 3,300 మంది పొలాల్లో మాత్రమే బోర్లను తవ్వారు. మిగిలిన 53 వేల మంది రైతులకు ఎదురుచూపులు తప్ప లేదు. పుణ్యకాలం గడిచిపోయి.. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఎన్నిసార్లు తిరిగినా..

వైఎస్సార్ జలకళ పథకం కింద బోర్లు తవ్వాం. బిల్లుల కోసం రెండేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. పట్టించుకునే నాథుడే లేడు. నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. ఇక్కడ మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా బోర్లు వేయాలని మాపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. గత్యంతరం లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. బోర్లు వేయడానికి డీజిల్, కూలీల ఖర్చులకూ చేతిలో డబ్బు లేదు. మాకు న్యాయం చేయాలని కోర్టుకు విన్నవించాం.

- వెంకటరామిరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, భాస్కర్‌నాయుడు, కాంట్రాక్టర్లు

ఉన్నతాధికారులకు నివేదించాం..

వైఎస్సార్ జలకళ పథకం బోర్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డ్వామా పీడీ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే బిల్లులన్నీ చెల్లిస్తాం. రైతులు, కాంట్రాక్టర్లు ఆందోళన చెందాల్సిన పనిలేదు. వైఎస్సార్ జలకళ లబ్ధిదారులందరి పొలాల్లో బోర్లు తవ్విస్తాం. విద్యుత్ కనెక్షన్, మోటార్లను అందజేస్తాం.

- సుధాకర్ రెడ్డి, వైఎస్సార్ జలకళ అదనపు పీడీ




అలకోత్సవంలో దేవేరులతో నారసింహుడు

అలకోత్సవం

అమ్మవార్ల అలక తీర్చిన శ్రీవారు
ఆకట్టుకున్న శ్రీవారు, దేవేరుల సంవాదం
అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

కదిరి, మార్చి 31: ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అలకోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ఈ ఉత్సవాన్ని ఆలయ ఈఓ, ఉప కమిషనర్ శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. కల్యాణోత్సవం నాటి నుంచి రోజుకో వాహనంపై ఊరేగుతూ భక్తులను తప్ప తమను పట్టించుకోవడం లేదంటూ శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లు అలక పాన్పు ఎక్కడం, వారిని శ్రీవారు అనునయించిన ఘట్టాలే అలకోత్సవం. అమ్మవార్ల తరపున ఈఓ వకాల్తా పుచ్చుకోగా శ్రీవారు, అమ్మవార్ల మధ్య సంభాషణను ఆలయ అర్చకులు భక్తులకు విన్పించడం ఈ ఉత్సవ ప్రత్యేకత. సృష్టిలో సర్వమూ తానేనని, లోకకల్యాణార్థమే తాను భక్తుల చెంతకు వెళ్తున్నాని, శ్రీవారు నచ్చచెప్పడంతో అమ్మవార్లు శాంతించి యాగశాల ప్రవేశం గావించారు. ఈ ఉత్సవానికి ఆలయ ఈఓ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి శ్రీవారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అలకోత్సవం అనంతరం శ్రీవారు అశ్వవాహనం పై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పదిహేను రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని చాటి చెప్పేందుకే శ్వేత అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తీర్థవాది జరగనుంది.




అలకోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు.. నృత్యం చేస్తున్న యువతులు


స్పాట్ కేంద్రంలోని గదుల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి


ఎండల నేపథ్యంలో స్పాట్‌లో అందుబాటులో ఉంచిన ఫ్యాన్లు

నేటి నుంచి పది మూల్యాంకనం

- కేఎస్ఆర్ హైస్కూల్‌లో టెన్త్ స్పాట్
- 1154 మంది సిబ్బంది నియామకం
- అన్ని ఏర్పాట్లు చేశాం: డీఈఓ

అనంతపురం విద్య, మార్చి 31: పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం నుంచి 8వ తేదీ వరకూ మూల్యాకనం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ హైస్కూల్, జూనియర్ కళాశాల ఆవరణలోని పలు గదుల్లో పది మూల్యాంకనం నిర్వహించనున్నారు. మూల్యాంకనానికి అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, ఇతర సిబ్బందిని 1154 మంది వరకూ నియమించారు. మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

కేఎస్ఆర్‌లో స్పాట్..

పదో తరగతి పరీక్షలు మార్చి 18న ప్రారంభమై 30వ తేదీ ముగిశాయి. దీంతో జవాబు పత్రాల మూల్యాంకానికి పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఏప్రిల్ 8వ తేదీ వరకూ స్పాట్ వాల్యుయేషన్ నిర్వహించనున్నారు. కేఎస్ఆర్ హైస్కూల్‌లోని పలు గదులు, వరండా, జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు తెప్పించారు. ఎండకాలం నేపథ్యంలో ప్రత్యేకంగా ఫ్యాన్లు అందుబాటులో ఉంచారు. స్పాట్ నిర్వహణ కోసం సిబ్బందిని నియమించారు. ఏఈలు, సీఈలు తెలుగు కోసం 118మందిని, ఇంగ్లీష్ 91, హిందీ 92, గణితం 82, ఫిజికల్ సైన్స్ 88, బయాలజీకి 75, సోషియల్ 100, ఒకేషనల్‌కు మరో ఏడుగురిని నియమించారు. 653 మందికి అదనంగా మరో 30 శాతం మందిని కలిపి 835మందిని నియమించారు. స్పెషల్ అసిస్టెంట్లు మరో 300 మందిని నియమించారు.


స్పాట్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు, ఫ్యాన్లు

ఏర్పాట్లు చేశాం: వరలక్ష్మి

పదో తరగతి స్పాట్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. కుర్చీలు, టేబుళ్లతోపాటు, ఫ్యాన్లు, తాగునీరు అందుబాటులో ఉంచాం. స్పాట్ కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓతో మాట్లాడాం. ఆర్‌జేడీతో మాట్లాడి కేంద్రం వద్ద సిబ్బంది సౌకర్యార్థం క్యాంటీన్ కూడా ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటాం.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్, మార్చి 31: ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని చర్చిల్లో పాస్టర్లు, మతబోధకులు ఏసు క్రీస్తు పునరుత్థాన వృత్తాంతాన్ని వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాకేంద్రంలో అరవిందనగర్‌లోని సీఎస్ఐ చర్చి, సప్తగిరి సర్కిల్ ఎస్ఐయూ చర్చి, రామచంద్రనగర్‌లోని కార్మెల్‌మాత చర్చి, జీసస్ కంపాషన్ చర్చి, కళాకారుల కాలనీలోని క్రీస్తు ప్రార్థనామందిరం, ఆర్డీటీ కార్యాలయం వద్ద గల ఎమ్మా బిల్డింగ్స్, అంబేడ్కర్‌నగర్‌లోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం ఇలా నగరంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు భక్తిపాటలు ఆలపిస్తూ, నృత్యాలతో అలరించారు.


రంజాన్ వేళలు

ఇఫ్తార్	సోమవారం సాయంత్రం 06:33
సెహరీ	మంగళవారం ఉదయం 04:58



హైవే పక్కన మంటలు



అనంతపురం నగర శివారులోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన నిత్యం చెత్త కుప్పల దహనం జరుగుతోంది. రుద్రంపేట పంచాయతీ పరిధిలో రాజహంస అపార్ట్‌మెంట్స్ సమీపంలో ఈ తంతు నడుస్తోంది. జాతీయ రహదారికి అటు, ఇటు ఉన్న పలు దుకాణాలు, హోటళ్ల నుంచి ప్యాకింగ్ అట్టలు, పీఓపీ షీట్లు, చెత్త, వ్యర్థాలను తెచ్చి అక్కడ కుప్పగా పోసి నిప్పంటిస్తున్నారు. రోజూ ఓ ట్రాక్టర్‌కు సరిపడా చెత్తకు ఇక్కడ నిప్పు పెడుతున్నారు. దీంతో ఉవ్వెత్తున మంటలు ఎగసిపడుతున్నాయి. పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇప్పటికే విద్యుత్, కేబుల్ వైర్లు మంటల తీవ్రతకు మాడిపోయాయి. సమీపంలో పలు వాహనాల షోరూంలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్డు డివైడ్ అయ్యే ప్రాంతం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. చెత్తసేకరణ విషయంలో రుద్రంపేట పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందుకే ఇళ్ల, దుకాణాలలోని చెత్తచెదారాన్ని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన పడేసి నిప్పు పెడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికాలు స్పందించాల్సిన అవసరం ఉంది.

- అనంతపురం రూరల్

కరువు జిల్లాను ఆదుకోవాలి

పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శైలజనాథ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 31: ఉమ్మడి అనంతపురం జిల్లాను ఆదుకోవాలని అన్ని రాజకీయ పార్టీల అగ్రనాయకులకు పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మీరు తిరిగిన ప్రాంతాల్లో కరువును గమనిస్తున్నారా..? తాగడానికి నీళ్ల లేక ప్రజలు అల్లాడిపోతుంటే, ఉద్యాన పంటలకు తగిన నీళ్ల లేక ఎండిపోతున్నాయి కదా వాటిని కాపాడే ప్రయత్నం చేయండని వారికి సూచించారు. జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి ఒక్కరూ ఈ సమస్యను గుర్తించాలన్నారు. జిల్లాకు 125 టీఎంసీల నీరు రావాలి. రాయలసీమకు మొత్తం 600 టీఎంసీల నీరు వచ్చే అవకాశముందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారు జిల్లాకు ఏం చేస్తారన్నది చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమిలో ఉన్న పార్టీలు ఈ రాష్ట్రానికి ఉపయోగపడేలా పనులు చేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఏం చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. కుటుంబ విషయాలు మాట్లాడకుండా జిల్లాకు ఉపయోగపడే విషయాలు మాట్లాడితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వాసు, మహిళా అధ్యక్షురాలు నాగమణి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రామ్‌చరణ్ యాదవ్, మైనార్టీ నగర అధ్యక్షుడు శర్మాస్ వలి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.31కోట్లు స్వాధీనం?

తాడిపత్రిటౌన్, మార్చి 31: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోలో తరలిస్తున్న రూ.1.31కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న ఈ డబ్బును పోలీసులు గుర్తించి సీజ్ చేశారని సమాచారం. డబ్బులకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో ఆ వ్యక్తిని కూడా విచారిస్తున్నట్లు తెలిసింది.

ఉష్ణోగ్రతలు (ఆది)



గరిష్ఠం	40.0
కనిష్ఠం	24.0

సీఎం విడిది కేంద్రంలో ఈస్టర్ వేడుకలు

- పాల్గొన్న జగన్ భార్య భారతి
- రెండు కిలోమీటర్ల మేర రహదారి బంద్
- ఇబ్బందులు పడిన వాహనదారులు, రైతులు

బత్తలపల్లి, మార్చి 31: మండలంలోని ముష్టూరు-రాఘవంపల్లి క్రాస్ మధ్య అనంతపురం-చెన్నై జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సీఎం జగన్ విడిది కేంద్రంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. జగన్ చేపట్టిన బస్సుయాత్ర శనివారం అర్ధరాత్రికి ముష్టూరు-రాఘవంపల్లి క్రాస్ మధ్య ఏర్పాటు చేసిన విడిది కేంద్రానికి చేరుకుంది. ఆదివారం ఈ విడిది కేంద్రంలో సీఎం జగన్‌తోపాటు ఆయన సతీమణి భారతి ఈస్టర్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు. విడిది కేంద్రం వద్ద పోలీసులను భారీగా మోహరించారు.

జాతీయ రహదారి బంద్

అనంతపురం-చెన్నై జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. రహదారి పక్కన ముష్టూరు-రాఘవంపల్లి మధ్య సీఎం జగన్ విడిది కేంద్రం ఏర్పాటుచేశారు. దీంతో పోలీసులు ముష్టూరు క్రాస్ నుంచి రాఘవంపల్లి క్రాస్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని బంద్ చేశారు. భారీఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వన్‌వేలో వెళ్లాల్సి రావడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళనలు చెందారు. రెండు కిలోమీటర్ల మేర వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులను కూడా పోలీసులు అడ్డుకున్నారు. పొలాల వద్దకు వెళ్లనీయలేదు. తమ పొలాల వద్దకు వెళ్లకుండా అడ్డుకునే హక్కు పోలీసులు ఎవరిచ్చారని రైతులు మండిపడ్డారు. చేసేదిలేక వారు చుట్టుపక్కల గ్రామాలను చుట్టేసుకుని, తమ పొలాలకు వెళ్లాల్సి వచ్చింది.





సీఎం జగన్ విడిది కేంద్రం.. ఎండ వేడిమి భరించలేక చెట్లకింద సేదతీరుతున్న పోలీసులు



అనంతపురం-చెన్నై జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు

దాహం.. దాహం

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- నీటి సమస్య పట్టించుకోని పాలకులు
- పొలాల వైపు గ్రామీణుల పరుగులు
- కొన్ని ప్రాంతాల్లో ఉప్పునీరే గతి

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. తీవ్ర వర్షాభావంతో మండు వేసవిలో బోరుబావులు ఎండిపోతున్నాయి. కొన్నింటిలో అరకొరగానే నీరు వస్తున్నాయి. పాలకులు, అధికారులు దాహార్తి తీర్చలేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం వ్యవసాయ పొలాల వైపు పరుగులు పెడుతున్నారు. గత ఏడాది మోస్తరు వర్షాలు కూడా కురవకపోవడంతో పలు ప్రాంతాల్లో భుగర్భ జలాలు అడుగంటాయి. కొన్ని ప్రాంతాల్లో 500, వెయ్యి అడుగులు బోరుబావులు తవ్వినా చుక్కనీరు లభించడం లేదు. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు గ్రామ సమీపంలోని పొలాల వద్దకు వెళ్లి సైకిళ్లు, స్కూటర్లు, ఎద్దులబండ్ల మీద నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న అరకొర నీరు సరిపోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతకల్లుటౌన్, మార్చి 31: వేసవిలో ఎండలు ముదిరే కొద్దీ గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. మండలంలోని మొలకలపెంట, ఎన్ వెంకటాంపల్లి, గుర్రబ్బాడు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. మొలకలపెంట గ్రామంలో గత ఏడాది ఆగస్టు నుంచి తాగునీటి ఎద్దడి నెలకొంది. గుంతకల్లు రోడ్డులో, అమీన్‌పల్లి రోడ్డులో చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే వెంకటాంపల్లి గ్రామంలో భూగర్భజలాలు అడుగంటడంతో నీటి కష్టాలను గ్రామస్థులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన ట్యాంక్‌కు పైప్‌లైన్ ద్వారా నీరు ఎక్కకపోవడంతో మధ్యలో లీకేజీ పైపుల ద్వారా వస్తున్న నీటిని ప్రజలు పట్టుకుంటున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద నాలుగు బోర్లు వేసినా నీరు పడలేదు. రోజుకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే గుర్రబ్బాడు గ్రామంలో ఇదే పరిస్థితి. రోజు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గుంతకల్లులోని సీఐటీయూ, రామిరెడ్డి, దోనిముక్కల రోడ్డు, హంపయ్య, మోదీనాబాద్, సాయినాథ్‌గౌడ్ కాలనీ, సిద్ధార్థనగర్‌లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొన్ని కాలనీలకు పైప్‌లైన్ లేకపోవడంతో మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 3 నుంచి 6 రోజులకొకసారి ట్యాంకర్లు రావడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.



వెంకటాంపల్లి గ్రామంలో లీకేజీ పైప్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



నింబగల్లు వద్ద ఎండిపోయిన తాగునీటి చెరువు



గుంతకల్లులో సిద్ధార్థ నగర్‌లో పని చేయని స్పాట్ డెలివరీ ట్యాంకు



గుత్తిలో వంతుల కోసం చెట్టుకు వేలాడదీసిన బిందెలు

పదిహేను రోజులకు ఒక్కసారి

ఉరవకొండ: పట్టణంలో పదిహేను రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ఉరవకొండతో పాటు ఏడు గ్రామాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది. అక్కడ మూడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఉన్నాయి. మూడో ట్యాంకు ఇప్పటికే ఎండిపోయింది. పెద్ద ట్యాంకులో 15 అడుగులకుగాను ప్రస్తుతం 4 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. బండల ట్యాంకులో 6 మీటర్లకు గాను 2 మీటర్లు ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మరో నెలరోజులు రావడం కూడా గగనమే. మండలంలోని రాయంపల్లి, నెరమెట్ల, బూదగవి, నింబగల్లు వెలికొండ గ్రామాల్లో కూడా తాగునీటి సమస్య నెలకొని ఉంది. కూడేరు మండలం కడదరకుంటలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలోని కాలువపల్లి, తట్రగల్లు గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో ఐదురోజులకు ఒక్కసారి నీటిని వదులుతున్నారు. 19 గ్రామాలకు నీటిని సరఫరా చేసే కొనకొండ్ల సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. విడపనకల్లు మండలంలోని డొనేకల్లు, హావళిగి పాల్తూరు గ్రామాల్లో నీటి సమస్య నెలకొంది.

వంతు కోసం చెట్టుకు బిందెలు

గుత్తి: గుత్తి పట్టణంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. పట్టణంలో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. పలు కాలనీల్లో స్పాట్ డెలివరీ ట్యాంకులు కూడా పనిచేయక వృథాగా పడి ఉన్నాయి. ప్రభుత్వం గుత్తికి నీటిని అందించడంలో ఘోరంగా విఫలమైంది. కోట వీధిలో వంతుల కోసం చెట్టుకు బిందెలు వేలాడదీసి క్యూలో పట్టుకుంటున్న పరిస్థితి ఉంది. గుత్తి గుత్తి ఆర్ఎస్‌లలో నీటి ఎద్దడి భయంకరంగా ఉంది.



వెయ్యి అడుగులు తవ్వినా దొరకని నీరు

మడకశిర: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మడకశిర ప్రాంతంలో వెయ్యి అడుగుల లోతు తవ్వినా చుక్కనీరు దొరకని పరిస్థితి నెలకొంది. రొళ్ల, అగళి మండలాల్లో 1000 అడుగులు తవ్వినా చుక్క నీరు దొరకడం లేదు. దీంతో పలుచోట్ల ట్యాకంర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. అగళి మండలంలో గాయిత్రికాలనీ, తండా, ముత్తేపల్లి, గుడిబండ మండలంలో సింగేపల్లి, జంబులబండ, కల్లురొప్పం, ఎస్ఎస్ గుండ్లు, మడకశిర పట్టణంలో 12,17, 4వ వార్డులలో తాగునీటి సమస్య నెలకొంది.



గాయిత్రి కాలనీలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

మూడు నెలలుగా కటకట

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు, ఊబిచెర్ల గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఊటకల్లులో మూడు బోర్లు ఉన్నాయి. ఒకబోరు పూర్తిగా ఎండిపోగా, మిగిలిన రెండింటిలో అరకొరగా నీరు వస్తోంది. దీంతో స్థానికులు మూడు నెలల నుంచి తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. గ్రామ శివారులోని ట్యాంకు నుంచి బైక్‌లపై నీటిని తీసుకెళ్తున్నారు. కే ఊబిచెర్లలోని బీసీ కాలనీలో పైపులైన్ లేని కారణంగా తాగునీటి సమస్య నెలకొంది.



సత్యసాయి నీటి సరఫరా అంతంతమాత్రమే

అనంతపురంరూరల్ : మండలంలోని పాపంపేట, అక్కంపల్లి, కురుగుంట, నారాయణపురం, చిన్నంపల్లి, కక్కలపల్లి కాలనీ, కామారుపల్లి తదితర ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో 80వేల మంది ప్రజలు నివాసముంటున్నారు. ఆయా ప్రాంతాలకు పీఏబీఆర్ నుంచి సత్యసాయి నీటి పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఆయా ప్రాంతాల పరిధిలోని సంపులకు నీటి సరఫరా చేసి, ఓవర్ హెడ్ ట్యాంకులను నింపి వాటి ద్వారా ప్రజలకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే పీఏబీఆర్ వద్ద నీటి పంపిణీ మోటర్లు మరమ్మతులకు గురైనట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఒక మోటార్‌తోనే నీటిని పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలో గ్రామాలకు నీటి సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతోంది.

ఉప్పునీటితో సరిపెట్టుకుంటున్న ప్రజలు..

సత్యసాయి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామీణులు నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి అవసరాలకు ఆటోలతో సరఫరా అయ్యే నీటిని బిందె రూ.10తో కొనుగోలు చేస్తున్నారు.

నీటి ఎద్దటి నేపథ్యంలో పంచాయతీలో స్థానికంగా బోర్ల ద్వారా ఉప్పునీటిని సరఫరా చేస్తున్నారు. వాటితోనే ప్రజలు తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఈ నీరు కూడా పాపంపేట పరిధిలో ఒక్కొక్క ప్రాంతానికి నాలుగైదు రోజుల కోసారి సరఫరా అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నెలకోసారి వస్తున్న సత్యసాయి నీరు..

తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సత్యసాయి నీరు వస్తే బాగుంటుంది. అవి నెల, రెండు నెలలకోసారి వస్తున్నాయి. దీంతో వీధిలోకి వచ్చే ట్యాంకర్లతో బిందె రూ.10తో కొనుగోలు చేస్తున్నాం. ఉప్పునీళ్లు కూడా రెండు మూడు రోజులకోసారి వస్తున్నాయి. - శైలాజ, పాపంపేట



కక్కలపల్లి కాలనీలోని సత్యసాయి నీటి సరఫరా సంపు

ఉప్పునీటితోనే సరిపెట్టుకుంటున్నాం



స్థానికంగా ఏడేళ్లుగా నివాసముంటున్నాం. గతంలో నీటి కోసం ఇంత ఇబ్బందులు పడలేదు. సత్యసాయి నీరు మూడు నెలలకోసారి వస్తున్నాయి. ఉప్పునీరు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. దీంతో ఇంట్లో ఉన్న బోరులో వచ్చే ఉప్పు నీటితోనే సరిపెట్టుకుంటున్నాం. ఉప్పునీటి కారణంగా ఫ్యూరిఫైడ్ పరికరాలు దెబ్బతినడంతో వాటిని మూలపడేశాం. ఆటోవారితో కొనుగోలు చేసి తాగునీటి సమస్యను తీర్చుకుంటున్నాం. - పుష్పావతి, బాలాజీ విలాస్

సీఎంపై చెప్పు విసిరిన ఘటనపై కేసు

అనంతపురం క్రైం, మార్చి 31: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై చెప్పు విసిరిన ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు యాత్రలో భాగంగా శనివారం జిల్లాలో సీఎం జగన్ పర్యటించారు. గుత్తి పట్టణంలో బస్సుపై అభివాదం చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చెప్పు విసరడం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా, ఆ వ్యక్తిని పట్టుకునేందుకు పలు పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. సీసీ ఫుటేజీ, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా చెప్పు విసిరిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

నవోదయ ఫలితాలు విడుదల

లేపాక్షి, మార్చి 31 : నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి జనవరి 20న జరిగిన పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదలైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 8,857మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4,871మంది హాజరై పరీక్ష రాశారని తెలిపారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 79సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారితో భరీచేస్తామన్నారు. పూర్తి వివరాలకు లేపాక్షి నవోదయ విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

ముగ్గురు వలంటీర్లు, ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బంది తొలగింపు

అనంతపురం టౌన్, మార్చి 31: జిల్లాలో ప్రభుత్వంనుంచి గౌరవ వేతనాలు పొందుతూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా రాజకీయ ప్రచారాల్లో పాల్గొన్న మరో ఐదుగురిపై కలెక్టరు వేటు వేశారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం హావళిగికి చెందిన వలంటీర్ కొల్లారప్పతోపాటు రాప్తాడు నియోజకవర్గం అనంతపురంరూరల్ మండలం కందుకూరుకు చెందిన వలంటీర్లు ప్రతీణ్, గణేష్‌లు కోడ్ నిబంధనలను వ్యతిరేకిస్తూ వైసీపీ ప్రచారంలో పాల్గొన్నందుకు విధులనుంచి తొలగించినట్టు కలెక్టరు గౌతమి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విడపనకల్లు మండలం హావళిగికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, తాడిపత్రి ఆటోనగర్‌కు చెందిన షిఫ్ట్ ఆపరేటర్ పావురాల క్రిష్టయ్యను సస్పెండ్ చేశారు. సీ విజిల్ యాప్‌కు ఆదివారం 15 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టరు గౌతమి తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జేఎన్‌టీయూలో నియోజకవర్గాల వారీగా కౌంటింగ్

అనంతపురం టౌన్, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన పోలింగ్‌బూత్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈప్రక్రియను చేపట్టారు. కలెక్టరు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లావ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో కూడా 1500 ఓటర్లు ఉన్నచోట ఇబ్బందులు కలగకుండా కమిషన్ సూచనల ప్రకారం అక్కడ సహాయ పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 2,213 సాధారణ పోలింగ్ స్టేషన్లు ఉండగా 23 సహాయ కేంద్రాలు ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రాలను జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా నియోజకవర్గాల వారీగా ఒక్కో నియోజకవర్గానికి సంబంధించిన ఓట్లు లెక్కించనున్నారు.

● నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు ఇలా...

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	సహాయక కేంద్రాలు	మొత్తం
రాయదుర్గం	2,62,520	296	00	296
ఉరవకొండ	2,22,752	259	04	263
గుంతకల్లు	2,68,194	276	00	276
తాడిపత్రి	2,46,573	272	02	274
శింగనమల	2,45,300	293	00	293
కళ్యాణదుర్గం	2,78,466	261	00	261
అనంతపురం	2,78,475	277	15	292
రాప్తాడు	2,48,313	279	02	281

● జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు ఇలా...

నియోజకవర్గం	కౌంటింగ్ ప్రాంతం
రాయదుర్గం	జేఎన్‌టీయూ ప్రధానభవనం, 1వఅంతస్తు(నార్త్‌వింగ్)
గుంతకల్లు	జేఎన్‌టీయూ ప్రధానభవనం, 1వఅంతస్తు (సౌత్‌వింగ్)
తాడిపత్రి	జేఎన్‌టీయూ ప్రధానభవనం, గ్రౌండ్‌ఫ్లోర్, (సౌత్‌వింగ్)
ఉరవకొండ	జేఎన్‌టీయూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, (గ్రౌండ్‌ఫ్లోర్)
శింగనమల	జేఎన్‌టీయూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, (1వ అంతస్తు)
కళ్యాణదుర్గం	జేఎన్‌టీయూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, (1వ అంతస్తు)
అనంతపురం అర్బన్	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్, (1వ అంతస్తు)
రాప్తాడు	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్, (1వ అంతస్తు)

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



చింతా రాజేశ్వరి (ఫైల్)

ధర్మవరం, మార్చి 31: పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డికాలనీకి చెందిన చింతా చిదంబరం, శారద దంపతుల కుమార్తె చింతా రాజేశ్వరి(21) పుట్టపర్తిలోని సంస్కృతి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఈమె తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేది. తల్లిదండ్రులు పలు చోట్ల చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున నొప్పి తీవ్రం కావడంతో మనస్థాపం చెందిన విద్యార్థిని ఇంటిలోనే ఓ గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తల్లి కిటికిలో ంచి చూడగా.. రాజేశ్వరి ఉరికి వేలాడుతూ కనిపించింది. తల్లి పెద్దగా కేకలు వేయడంతో కుటుంబసభ్యులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి ఆమెను కిందకు దించి చూశారు. అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాలు ఢీ

- వలంటీర్ మృతి..
- రిటైర్డ్ టీచర్ పరిస్థితి విషమం

గోరంట్ల, మార్చి 31: మండలంలోని పుట్టపర్తి ప్రధాన రహదారిలో నిషా డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని, గ్రామ వలంటీర్ వినోద్ కుమార్(28) మృతిచెందగా, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగప్పకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి విలాస్ లో నివాసముంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగప్ప కొత్త చెరువుకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి వస్తున్నాడు. అలాగే మండలంలోని పుట్టగుండ్లపల్లికి చెందిన వలంటీర్ వినోద్ స్వగ్రామానికి వెళ్తున్నాడు.

ఈ రెండు ద్విచక్ర వాహనాలు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రెం డు ద్విచక్రవాహనాలు రోడ్డుకు కుడివైపున పడిపోగా, ఇరువురు చేరోవైపున తీవ్రగాయాలతో పడ్డారు. సమీపంలోని గుంతపల్లి గ్రామస్థులు గమనించి 108 వాహనం ద్వారా గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వినోద్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. నాగప్ప చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావంతో అపస్మాకర స్థితిలో ఉండగా మెరుగైనవైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఈ సంఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు వినోద్‌కు నాలుగు నెలల కిందటే వివాహమైంది.

అలరించిన సంగీత కచేరి

పుట్టపర్తి, మార్చి 31: అనంతపురానికి చెందిన సత్యసాయి మహిళా కళాశాల విద్యార్థినులు సంగీత గాన కచేరి చేపట్టి భక్తులను అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో ఆదివారం సాయంత్రం డిగ్రీ, పీజీ విద్యార్థినులు విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా.. ప్రేమకు ప్రేమతో పేరిట వాయిద్య సంగీత గాన కచేరిని నిర్వహించారు. తబలా, బ్యాండ్ మేళం వాయిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థినులు

పొత్తు ధర్మాన్ని పాటిద్దాం

● ఆగ్రహావేశాలు వద్దు... సంయమనం పాటించండి
● జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్



మాట్లాడుతున్న టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 31: అనంతపురం అర్బన్ టిక్కెట్ కేటాయింపు విషయంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలే శిరోధార్యంగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పొత్తు ధర్మాన్ని పాటించాలని సూచించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో టీసీ వరుణ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. పలువురు నేతలు, వీర మహిళలు అనంత టిక్కెట్ దక్కకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి కుటుంబాలు, వ్యాపారాలు వదులుకొని కష్టపడ్డామన్నారు. జిల్లాలో పార్టీని ఎంతో బలోపేతం చేసిన వరుణ్‌కు కాకుండా టీడీపీకి కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీసీ వరుణ్ కలుగజేసుకొని ఆగ్రహావేశాలు వద్దు... సంమయమనం పాటించండి. అధినేత ఆదేశాల మేరకు పొత్తు ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి జన సైనికుడు కష్టపడి పనిచేసి అభ్యర్థిని గెలిపించాలన్నారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య పాల్గొన్నారు.

స్వర్ణయుగం వైపు నడిపించే సారథి చంద్రబాబు

● టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి

శింగనమల, మార్చి 31: రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే నాయకుడు చంద్రబాబు అని టీడీపీ శింగనమల అభ్యర్థి బండారుశ్రావణి ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు అనుభవం అవసరమన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రివర్స్ పాలనతో ప్రజల జీవితాలు నాశనమయ్యాయన్నారు. యవత భవితకు బాబు హామీ ఇస్తున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు.

అనుభవం, బాధ్యత ఉన్న నేత బాబు

● రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు

నార్పల, మార్చి 31: అనుభవం, బాధ్యత ఉన్న నేత చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు అన్నారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు తనను తాను డ్రైవర్‌గా అభివర్ణించుకున్నారని అన్నారు. అనుభవం, బాధ్యత ఉన్న నేతగా మన కోసం చేసే పోరాటంతో ప్రజలందరూ ఆయనకు అండగా నిలవాలన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మామిడి చెట్లు దగ్ధం

నార్పల, మార్చి 31: మండలంలోని ముగేత్తంపల్లి గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున రైతులు బయన్న రాజశేఖర్, వేమ నారాయణలకు చెందిన మామిడి చెట్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమయ్యాయి.


పూర్తిగా దగ్ధమైన మామిడి చెట్లు

నార్పల మండలం మూగేత్తంపల్లి గ్రామానికి చెందిన బయన్నరాజశేఖర్, వేమనారాయణ రోజులాగానే తోటలో పనులు ముగించుకొని ఇంటికి వచ్చారు. రైతులకు చెందిన ఎనిమిదేళ్ల మామిడి చెట్ల పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగులుకొని నిప్పురవ్వలు ఎగసి పడ్డాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి 130పైగా మామిడి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.5లక్షల వరకు పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వీఆర్వోలు దగ్ధమైన మామిడి చెట్లను పరిశీలించారు. పంట నష్టాన్ని అధికారులకు నివేదిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి 'అమ్మ' అండ

అనంతపురం కల్చరల్, మార్చి 31: కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాలెదుర్కొంటున్న నిరుపేద కుటుంబానికి అమ్మ సంస్థ అండగా నిలిచింది. స్థానిక 2వ రోడ్డులో నివాసముంటున్న వన్నూరప్ప, రాధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వన్నూరప్ప 7 నెలల క్రితం మృతిచెందాడు. కుటుంబ పెద్ద మరణించడంతో భార్య, ముగ్గురు పిల్లల జీవనం అగమ్యగోచరంగా మారింది. రాధ టైలరింగ్ పనికి వెళ్తూ కుటుంబ పోషణను కష్టంగా సాగిస్తోంది. ఉండడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో వీరు అనేక కష్టాలెదుర్కొంటూ దాతల సాయం కోసం అమ్మ సంస్థను ఆశ్రయించారు. ఆదివారం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి కుటుంబాన్ని కలిసి పిల్లల భవిష్యత్‌కోసం రూ.1.5లక్షలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడంతోపాటు రాధకు రూ.40వేలు విలువ చేసే కుట్టు మిషన్, 6 నెలలకు సరిపడా రూ.50వేలు విలువచేసే నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు అందజేశారు.

సందడిగా బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం

అనంతపురం విద్య, మార్చి 31: రాంనగర్‌లోని బచ్‌పన్ స్కూల్ 11వ వార్షికోత్సవం సందడిగా చేశారు. నగరంలోని నీలం సంజీవరెడ్డి ఫంక్షన్ హాల్‌లో స్కూల్



యూకేజీ విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరిస్తున్న చైర్మన్

వార్షికోత్సవం నిర్వహించారు. స్కూల్ చైర్మన్ దాదా గాంధీ, డాక్టర్లు సందీప్, హేమలత, సునీత మరికొందరు విచ్చేసి చిన్నారులతో సందడిగా గడిపారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, సాహస కృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులను మెడల్స్, గ్రాడ్యుకేషన్ సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి సరితారెడ్డి, ఇతర టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైవేకు దగ్గరలోనే 'మహతి' వెంచర్లు

అనంతపురంరూరల్, మార్చి 31: మహతి వెంచర్లన్నీ హైవేకు దగ్గరలోనే వేశామని ఆ సంస్థ ఎండీ గణేశం ముత్యాలరెడ్డి అన్నారు. స్థానిక జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మహతి రియల్‌ఎస్టేట్ ఆధ్వర్యంలో ఆదివారం మహతి హైవే కౌంటీ బ్రోచర్ ఆవిష్కరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో 2017లో సంస్థ స్థాపించామన్నారు. మొట్టమొదటి వెంచర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ సమీపంలో షాద్‌నగర్ దగ్గర 50 ఎకరాల్లో వెంచర్ వేశామన్నారు. అనంతపురం జిల్లాలో అన్నింటికీ అనుకూలమైన వాతావరణమన్నారు. పెట్టుబడులకు భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందులో భాగంగానే సంస్థ వెంచర్లన్నీ హైవేకు దగ్గరలో వేశామన్నారు. మహతి కౌంటి, ప్రజెంట్ వ్యాల్యూ, జీఎంఆర్ కాలనీ మూడు వెంచర్లు అహుడా పరిధిలో ఏర్పాటు చేసి ఐకానిక్ ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దామని, అన్ని సదుపాయాలతో బ్యాంకులోన్ సౌకర్యం కూడా ఉందన్నారు. సంస్థ సభ్యులు రవికుమార్, తిరుమలయ్య, ఇంజనీర్‌లు, కాంట్రాక్టర్లు, కస్టమర్లు, మిత్రులు పాల్గొన్నారు.


మహతి హైవే కౌంటీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎండీ గణేశం ముత్యాలరెడ్డి

ప్రకాష్‌రెడ్డికి పరాజయం తప్పదు

● ప్రజాసమస్యలను పట్టించుకున్న పాపానపోలేదు
● ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం
● మాజీ మంత్రి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, మార్చి 31: నియోజకవర్గంలో ఐదేళ్లగా ఏ ఒక్క రోజూ ప్రజల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఎన్నికల్లో ఓటమి తప్పదని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి, ఎర్రోనిపల్లి, గంగినేపల్లి, వెల్దుర్తి, బసంపల్లి గ్రామాలలో ఆదివారం ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పరిటాల సునీతకు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు 52 నియోజవర్గాల నుంచి 5 వేల బస్సులు, ఇతర వాహనాలలో జనాలు తరలించిన ఎమ్మెల్యే వాపును బలుపుగా చెప్పుకుంటున్నాడని ఎద్దేవాచేశారు. ఆయన చదువుకున్నా సంస్కారం లేని వ్యక్తి అని విమర్శించారు. 2019 ఎన్నికల ముందు పేద అరుపులు అరసి సానుభూతితో ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన ఆ తరువాత అతని నిజస్వరుపం ఏమిటో ప్రజలకు చూపించాడన్నారు.


పరిటాల సునీతతో కలిసి విక్టరీ గుర్తు చూపుతున్న మహిళలు


ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న టీడీపీ శ్రేణులు

ముఖ్యంగా నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీలోని చాలామంది నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇన్ని రోజులు అధికారం ఉందని పోలీసులు, అధికారులు సహకరించారని ఇకపై ఆటలు సాగవన్నారు. మే 13వ తేదీ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఆ రోజు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతాయన్నారు. పేరూరు ప్రాజెక్టుకు నీరు తీసుకురావడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండలకన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, ముత్యాలప్ప, రామసుబ్బమ్మ, ఎజ్జే శంకర్, అంకే అమరేంద్ర, ప్రసాదమ్మ, నాగరాజు, హరి, పణీంద్ర, చంద్రాయుడు, బయన్న, మాడెం సూర్యనారాయణరెడ్డి, బెస్త నాగార్జున, ఐటీడీపీ పవన్, రామాంజి, శివ, అస్మత్, వరలక్ష్మి, సూరి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం


సిద్దరాంపురంలో టీడీపీ నాయకుల ప్రచారం


అనంతపురం రూరల్ పరిధి బసవతారక నగర్‌లో...

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురంలో శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిని గెలిపించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతరెడ్డి, బండారు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని, ఎమ్మెల్యేగా శ్రావణిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, నాగభూషణం, లింగమ్మ తదితరులు సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీతను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే ఆత్మకూరులో టీడీపీ యువ నాయకుడు పరిటా సిద్ధార్థ, కన్వీనర్ శ్రీనివాసులు, బాలాజీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. రామగిరి మండలం నసనకోటలో నాయకులు ప్రచారం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో...


ఆత్మకూరు మండలం పి. సిద్దరాంపురంలో...


రామగిరి మండలం నసనకోటలో...

అందరినీ కలుపుకుని ముందుకెళ్తా..!

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్


అనంత అర్బన్ టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, మార్చి 31: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు వెళతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలనీలో అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ... సోమవారం నుంచి నాయకులను వ్యక్తిగతంగా కలిసి ప్రచార కార్యక్రమాన్ని వేగవంతం చేస్తామన్నారు. అనంత అర్బన్‌లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. విజయం సాధించి ఈ సీటును చంద్రబాబుకు బహుమతిగా ఇస్తానన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు రాళ్లపల్లి అనంతయ్య, బుగ్గయ్యచౌదరి, సురేష్, మారుతీనాయుడు, మహేష్ పాల్గొన్నారు.

దగ్గుబాటిని గెలిపించి.. టీడీపీ జెండా ఎగురవేస్తాం

\- యువనేత ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్: రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్టీ జెండాను ఎగురవేస్తామని జడ్పీ మాజీ చైర్మన్ చమన్‌సాబ్ తనయుడు, యువనేత ఉమర్ ముక్తార్ అన్నారు. రామ్‌నగర్‌లోని చమన్‌సాబ్ నివాసానికి ఆదివారం వెళ్లిన దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ చమన్‌సాబ్ సతీమణి రమీజా, తనయుడు ఉమర్ ముక్తార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు దగ్గుబాటిని సన్మానించారు. ముక్తార్ మాట్లాడుతూ... వెంకటేశ్వర ప్రసాద్ తమ కుటుంబానికి ఎంతో ఆప్తులన్నారు. ఆయన గెలుపు కోసం అన్ని శక్తులను ఏకం చేసి పనిచేస్తామన్నారు. మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా, నాయకులు హరి, చాంద్, బాషా, బుక్కచర్ల లక్ష్మీనారాయణరెడ్డి, దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.


దగ్గుబాటిని సన్మానిస్తున్న రమీజా బేగం, ఉమర్ ముక్తార్

సోషల్ మీడియా పోస్టులపై నిఘా: ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి31: ఎన్నికల వేళ...సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. వివాదాస్పద పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా మాధ్యమాలలో పాటించాల్సిన నియమ నిబంధనలు, సూచనలపై ఆదివారం ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో తప్పుదారి పట్టించే సమాచారాన్ని, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలను ఎవరూ పోస్ట్ చేయడం, ఫార్వర్డ్ చేయకూడదన్నారు. ట్రోలింగ్, ఆన్‌లైన్ వేధింపులు, తప్పుడు వార్తల ప్రచారాలపై ప్రత్యేక నిఘా వేస్తామన్నారు. వివాదాస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం, ఐపీసీ సెక్షన్ 153(ఎ)కింద శిక్ష, 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై 67 ఐటీ యాక్ట్, ఐపీసీ సెక్షన్ 354 కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పశువుల సంత ఆదాయం రూ.3.76 లక్షలు

అనంతపురంరూరల్, మార్చి 31: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,76,360 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,84,060, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,92,300 వచ్చిందని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ టిక్కెట్ బీసీలకు కేటాయించాలి

శింగనమల, మార్చి 31: అనంతపురం ఎంపీ టిక్కెట్ బీసీ వర్గాలకే కేటాయించాలని ఆ పార్టీ అనంతపురం పార్లమెంట్ ఓబీసీ చైర్మన్ రాంచరణ్‌యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంపీ టిక్కెట్ బీసీలకు కేటాయిస్తే బీసీ ఓటర్లు పార్టీ వైపు మొగ్గుచూపుతారని, అధిష్టానం ఈ స్థానాన్ని బీసీలకు కెలాయించాలని కోరారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

● మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 31: పార్టీ కోసం కష్టపడి పనిచేశాం... అందుకే హక్కుగా అడుగుతున్నామనీ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయింపుపై టీడీపీ అధిష్టానం పునరాలోచించాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కోరారు. ఆదివారం స్థానిక రాంనగర్‌లోని కమ్మభవన్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సామాజిక స్పృహతో, బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అలుపెరుగని శ్రామికుడిగా సమాజంపై చిత్తశుద్ధితో పనిచేస్తూ వచ్చానన్నారు. ఎన్టీఆర్ హయాంలో పార్టీలో చేరానని, ఆ తర్వాత చంద్రబాబు అధ్యక్షతన పని చేస్తూ వచ్చానన్నారు. చంద్రబాబునాయుడు ఏ పిలుపు ఇచ్చినా ఆయా కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు. తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకే ముందుకు వెళతానన్నారు. పార్టీ మారే ప్రసక్తే లేదని, టిక్కెట్ కోసం పోరాడతానని, లేదంటే కార్యకర్తల అభిప్రాయం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలుస్తానన్నారు. అధినాయకుడిపై తనకు నమ్మకం ఉందని, కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరారు. పార్టీలో ఉన్నా.. లేకున్నా ఊరుబాగుండాలని కృషి చేశానన్నారు. తన లాంటి వ్యక్తి ఎమ్మెల్యే కావాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని పార్టీ అధినాయకత్వం గుర్తించాలన్నారు. క్లస్టర్,యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, మాజీ కార్పొరేటర్లు, తెలుగు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


బండారు శ్రావణి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

శింగనమల, మార్చి 31: మండలంలోని నిదనవాడ గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో ఆదివారం గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీలోకి చేరినవారిలో లక్ష్మిరెడ్డి, మహేంద్రరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఆనంద్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుధాకర్, ఆంజనేయులు, సోమశేఖర్, నరేష్ ఉన్నారు. వారికి బండారు శ్రావణి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రెడ్డి చింతబరిదొర, సుధీర్‌రెడ్డి విశ్వనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేష్, శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుడు


పరిటాల సిద్ధార్థకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురంరూరల్, మార్చి31: మండలంలోని కామారుపల్లికి చెందిన వైసీపీ నాయకుడు మూలి చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీలోకి చేరారు. ఆదివారం రాత్రి అరవిందనగర్‌లోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపుకార్యాలయంలో పరిటాల సిద్ధార్థ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పరిటాల సిద్ధార్థ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వ్యవసాయంపై లండన్ విద్యార్థులకు అవగాహన


వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 31: లండన్‌లోని కింగ్స్ కాలేజ్‌కి చెందిన విద్యార్థులు సహజ వ్యవసాయ విధానాలపై అవగాహన పొందుతున్నారు. కింగ్స్ గ్లోబల్ డే ఆఫ్ సర్వీస్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ (ఆసియోన్ ప్రొటెర్రా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖిలో లండన్ విద్యార్థులు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రచారంలో భాగంగా సహజ వ్యవసాయ విధానాలపై వివరించారు. ఆవు పేడ, బెల్లం, పుట్ట నుంచి మట్టి, ఆవు మూత్రంతోపాటు పొడి పప్పును పిండి చేశారు. అనంతరం అక్కడ నుంచి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ వరకు రైతులు ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎకాలజీ సెంటర్‌లో కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ యాప్ పోస్టరు విడుదల, రైతు అవార్డులు ప్రదానం చేశారు. కరవు జిల్లాలో సామాజిక సహజ వ్యవసాయంతో అనేక లాభాలు, ప్రయోజనాలు ఉన్నాయని గ్రహించి అవగాహన కల్పించేందుకు లండన్ నుంచి ఇక్కడికి రావడం అభినందనీయమని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి అన్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుకూలంగా నేలలు, పరిస్థితులు ఉన్నాయని లండన్ కింగ్స్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకుడు స్టీఫెన్ అనురాగ్ తెలిపారు. సస్టెయినబుల్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రుద్రయ్య, ఏఎఫ్ ఎకాలజీ సీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఖలీల్‌అహ్మద్, సంఘం సభ్యులు హర్ సహాయ్ మీనా, అకాష్ పొద్దార్, తేజ త్రిభువన్ బోయ, జాకీర్ హుస్సేన్, సాహిల్‌ఖాదర్, హర్ష సాకే, అఖిల్‌రవి, ఇంద్రజ పాల్గొన్నారు.

నిండిన ఇంకుడు గుంత..

● రోడ్డుపైకి మురుగు నీరు..
● పట్టించుకోని పంచాయతీ అధికారులు


పాపంపేటలో రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

అనంతపురంరూరల్, మార్చి 31: మండలంలోని పాపంపేట పంచాయతీ బసవతారకనగర్‌లో ఇంకుడు గుంత నిండి, మురుగునీరు రోడ్డుపైకి చేరుతున్నాయి. ఫలితంగా వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బసవతారకనగర్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద కాలువలు లేనికారణంగా పంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. అయితే ఆ గుంత నిండిపోయింది. నీటిని బయటకు కొట్టించకపోవడంతో మురుగునీరు రోడ్డుపై చేరుతున్నాయి. కాలువ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కరించేందుకు వీలుంటుంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

ఆత్మకూరు, మార్చి 31: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. వచ్చిన భక్తులుకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ, ప్రధాన అర్చకులు రాముస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

తోటకు నిప్పుపెట్టిన వారిని శిక్షించాలి

● బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప

శింగనమల, మార్చి 31: వైసీపీ అసమ్మతివర్గంలో చురుకైన రైతు పట్నం నగేష్ ఆర్థికంగా దెబ్బ తీయాలని ఆయన తోటకు నిప్పు పెట్టిన సంఘటనపై వెంటనే విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ కమిషన్


పట్నం నగేష్ తోటను పరిశీలిస్తున్న కిష్టప్ప

సభ్యుడు రిటైర్డు న్యాయాధికారి కిష్టప్ప డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన రైతు పట్నం నగేష్ తోటకు గుర్తుతెలియని వ్యక్తులు 27న నిప్పు పెట్టడంతో రూ.3లక్షలు నష్టం వాటిల్లింది. తోటను బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, కురుబ సంఘం అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కురుబ సామాజికవర్గానికి చెందిన నగేష్ వైసీపీలో అసమ్మతి వర్గంలో ఉడడంతో ఆ పార్టీ నాయకులు దురుద్దేశంతో తోటకు నిప్పు పెట్టడం దారుణమన్నారు. రైతుకు చెందిన బిందు, తుంపర సేద్య పరికరాలు, ఇతర సామగ్రి బూడిదయ్యాయన్నారు. కాలిపోయిన పంటను ఏ అధికారి పరిశీలించేదన్నారు. పోలీసులు వచ్చి బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకోలేదని, దీన్ని బట్టి చూస్తే ఈ ఘటన అస్మమతి వర్గం నాయకుడనే పోలీసులు మిన్నకుండిపోయారని ఆరోపించారు. తక్షణం పోలీసులు, రెవెన్యూ అధికారులు తోటను పరిశీలించి బాధితుడికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా కురుబ సంఘం నాయకులు చిట్రా నారాయణస్వామి, బిల్లే నారాయణస్వామి, బ్యాళ్ల వీరానారాయణ, ఓబయ్య అట్టే ధనుంజయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.



దళితుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అమిలినేని

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

● ఆత్మీయ సమావేశంలో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 31 : టీడీపీతోనే దళితులు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద నియోజకవర్గంలోని దళితులతో కలసి భారీ ఎత్తున ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పదివేల మందికి పైగా దళితులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ దళితులకు పెద్దపీట వేస్తూ వారిని ఆదుకున్న ఘనత ఒక్క చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. దళితులుకు న్యాయం జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో యశ్వంత్ చౌదరి



ప్రచారంలో అమిలినేని యశ్వంత్

టీడీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి ఖాయమని అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ పేర్కొన్నా రు. ఆదివారం బ్రహ్మసముద్రం మండలం పరిధిలోని బుడిమేపల్లి, గుడిపల్లి, కన్నేపల్లి, ముద్దలాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పాలకుల ఆదాయ వనరులుగా తాగునీటి కొళాయిలు

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



మహిళలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ,మార్చి31: ఉరవకొండలో తాగు నీటి కొళాయిలు అధికార పార్టీ నాయకులకు ఆదాయ వనరులుగా మారాయని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. పట్టణంలో ఆదివారం బ్రహ్మణవీధి, తలారిగేరి, కుమ్మరవీధుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధిని తెలియజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కొళాయిలు ఏర్పాటు చేసుకోవాలంటే డబ్బులు డిపాజిట్ కడితే ప్రభుత్వఖజానాలోకి వెళ్లేదన్నారు. అయితే డిపాజిట్ల రూపంలో రూ.5కోట్ల ప్రజల కష్టార్జితాన్ని అనంతపురం కాంట్రాక్టర్‌కు చెల్లించినా, వైసీపీ నాయకులు నోరు మెదపలేదన్నారు. జల జీవన్ మిషన్ పేరుతో ఉచితంగా కొళాయిలు వేస్తుంటే వైసీపీ నాయకులు డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే తాగు నీటి వ్యవస్థపై మార్పులు తెస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీలు సుంకరత్నమ్మ, ప్రతాప్‌నాయుడు, పట్టణకన్వీనర్ రామాంజినేయులు, టీడీపీ నాయకులు లాయర్‌శ్రీనప్ప, తిమ్మప్ప, డీకే ప్రసాద్, సుంకన్న, ప్రతాప్, కన్వీనర్లు రమేష్, మల్లికార్జున, రాము, ఎర్రిస్వామి, ఉప్పరశ్రీన, బాలాజీ పాల్గొన్నారు.

టీడీపీపై దుష్ప్రచారం తగదు

గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఫించన్ల పంపిణీ చేసేలా, ఎన్నికల కమిషన్ ఆదేశాలివ్వాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఫించన్ల పంపిణీపై వైసీపీ నాయకులు టీడీపీపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. కావాలనే వృద్ధులను ఇబ్బంది పెట్టి టీడీపీపై అభాండాలు వేస్తున్నారని, సచివాలయ సిబ్బందితో ఫించన్ల పంపిణీ చేపడితే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

సూపర్ సిక్స్‌పై విక్రమ్‌సింహ ప్రచారం



ఇంటింటా ప్రచారంలో విక్రమ్‌సింహ

బెళుగుప్ప : మండలంలోని వెంకటాద్రిపల్లిలో ఆదివారం టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయుడు విక్రమ్ సింహ

ఓటమి భయంతోనే వైసీపీ దుష్ప్రచారం

● టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, మార్చి31: ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు సోషల్‌మీడియాలో చంద్రబాబు వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని ఎస్. తిమ్మాపురం, గాండ్లపాడు, పోతిరెడ్డిపల్లి, తక్కళ్లపల్లి, కొండేపల్లి గ్రామాల్లో ఆదివారం ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డిలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ అధినేత నారా చంద్రబాబునాయుడు అగ్రవర్ణాల చేతిలో వీరాంజనేయులు ఉన్నాడన్నారని, ఎక్కడా తక్కువ చేసి మాట్లాడలేదన్నారు. అనంతరం ద్విసభ్య కమిటీ సభ్యులు నరసానాయుడు, కేశవరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన పోవాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి శ్రావణిశ్రీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారంలో బండారు శ్రావణిశ్రీ



మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● గుమ్మనూరు జయరాం, అంబికా లక్ష్మీనారాయణ

గుంతకల్లు/గుత్తి/గుత్తిరూరల్, మార్చి31: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, హామీ ఇచ్చారు. ఆదివారం తొలిసారి గుంతకల్లు నియోజకవర్గానికి వచ్చిన వారిద్దరికీ అభిమానులు ఘనస్వాగతం పలికారు. గుత్తి మండలంలోని బాట సుంకులమ్మ దేవాలయంలో అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాలు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. చంద్రబాబును సీఎం చేసి రాష్ట్రాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి అంబికాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో ఆరాచక పాలన సాగిందని, దీనికి కారణమైన వైసీపీని చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని గుత్తి బాట సుంకులమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన గుమ్మనూరు జయరాం ర్యాలీ గుంతకల్లులో రాత్రిదాకా కొనసాగింది. సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో గుంతకల్లుకు చేరగా పట్టణ శివారులో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన కోసం ఎదురుచూసి బాణా సంచాను పేల్చి స్వాగతం పలికారు. టీడీపీ పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు, గుమ్మనూరు సోదరులు, నారాయణ శ్రీనివాసులు, నారాయణస్వామి, ప్రభాకర్ చౌదరి, సర్పంచు భరత్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ చౌదరి, లక్ష్మినారాయణమ్మ, వెంకటరాముడు, మాజీ ఎంపీటీసీలు ఇషాక్, నరసింహులు, వెంకటనారాయణ, రవితేజ నారాయణస్వామి ఏంకే చౌదరి, కేశవనాయుడు, ప్రతాప్, గోవిందు, రామాంజునేయులు, ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కాకర్ల బ్రదర్స్

● వేలాది మందితో ర్యాలీగా జేసీపీఆర్ ఇంటికి..

తాడిపత్రిటౌన్, మార్చి31: వైసీపీ ముఖ్యనాయకులు కాకర్ల బ్రదర్స్ కాకర్ల రంగనాథ, కాకర్ల జయుడు, కాకర్ల రంగనాయకులు ఆదివారం తన అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకర్ల బ్రదర్స్ సుమారు 6వేలమందితో ర్యాలీగా పట్టణంలోని కృష్ణాపురం జీరో రోడ్డు, పుట్లూరురోడ్డు, సంజీవనగర్ రోడ్డు మీదుగా జేసీపీఆర్ నివాసానికి చేరుకొని పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిలు కాకర్ల బ్రదర్స్‌కు టీడీపీ కండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేసీపీఆర్ మాట్లాడుతూ తాడిపత్రి అభివృద్ధి కోసం కాకర్ల బ్రదర్స్ తమ వెంట నడవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పార్టీలో చేరిన వారిలో వంగనూరు వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు రజిత ఆమె భర్త శ్రీనివాసులు, హుస్సేనాపురం వైసీపీ సర్పంచు తలారి నాగరత్నమ్మ ఆమె భర్త చిన్నపెద్దయ్య, గన్నెవారిపల్లి వైసీపీ వార్డు మెంబర్లు నాగేంద్ర, అశ్వర్థనాయుడు, పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నెకు చెందిన అదెన్న, చల్లా నారాయణప్ప, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.



కాకర్ల బ్రదర్స్‌తో జేసీపీఆర్, జేసీ అశ్మిత్‌రెడ్డి

సొంతింటికి వచ్చినట్లుంది: కాకర్ల రంగనాథ

టీడీపీలో చేరడం సొంతింటిలోకి వచ్చినట్లు ఉందని టీడీపీ సీనియర్ నాయకులు కాకర్ల రంగనాథ తెలిపారు. పార్టీలో చేరిన గతంలో చిన్నచిన్న మనస్పర్థల కారణంగా టీడీపీ నుంచి వీడి వైసీపీలో చేరానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు.

వైసీపీ కౌన్సిలర్ టీడీపీలో చేరిక

రాయదుర్గం, మార్చి 31: పట్టణంలోని 23వ వార్డు వైసీపీ కౌన్సిలర్ పద్మజ ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పట్టణంలోని ఆమె నివాసం వద్ద ఏర్పాటు చేసిన వేదికలో టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు కౌన్సిలర్‌తో పాటు ఆమె భర్త నాగేంద్రను కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆమెతో పాటు వార్డుకు చెందిన శ్రీనివాసులు, సతీష్‌కుమార్, గంగాధర, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, భీమ, అనిల్, తిప్పేస్వామి, నగేష్, వేణు, ప్రసన్న, వెంకటేష్, ప్రకాష్, గోవిందలతో పాటు 25 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబునాయుడు చల్లనిపాలన అవసరమన్నారు. జనసేన ఇన్‌చార్జ్ మంజునాథ్‌గౌడ్ పాల్గొన్నారు.



కౌన్సిలర్ పద్మజను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు



టీడీపీలో చేరిన వారితో కలిసి విక్టరీ గుర్తు చూపుతున్న అమిలినేని సురేంద్ర బాబు

టీడీపీలోకి 58 కుటుంబాలు

● సాదరంగా ఆహ్వానించిన అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 31 : కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు రోజు రోజుకు ఆదరణ లభిస్తోంది. ఆదివారం 58 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరందరికీ అమిలినేని సురేంద్రబాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కళ్యాణదుర్గం మున్సిపాల్టీకి చెందిన మొదటి వార్డు కౌన్సిలర్ అబ్రహమ్, 2వ వార్డు కౌన్సిలర్ అనసూయమ్మలు వైసీపీ పార్టీ నుంచి టీడీపీలోకి చేరారు. వారితో పాటు బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లికు చెందిన ఎనిమిది వైసీపీ కుటుంబాలు టీడీపీ పార్టీలోకి చేరాయి.

దోపిడీ కేసు దర్యాప్తు వేగవంతం చేయండి

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాలవ



బాధితులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, మార్చి 31: మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో శనివారం రాత్రి జరిగిన దోపిడీ కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పోలీసులను డిమాండ్ చేశారు. ఆదివారం దోపిడీ జరిగిన బాధిత తిప్పారెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రైతులు అహర్నిశలు కష్టపడి సంపాదించిన సొమ్ము దోపిడీ కావడం శోచనీయమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసుశాఖ నిందితులను వెంటనే పట్టుకోవాలని కోరారు. విషయాన్ని జిల్లా ఎస్పీతో చర్చించి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళకుర్తి సుదర్శన్, బసవరాజు, వన్నారెడ్డి, బాయినేని నవీన్, కురుబ నాగరాజు, ప్రకాష్, విజయ్, మారుతి, హరి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దోపిడీ జరిగిన ప్రాంతాన్ని డీఎస్పీ శ్రీనివాసులు ఆదివారం పరిశీలించారు. బాధితుడు తిప్పారెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడి దోపిడీ వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తా : జితేంద్రగౌడు




సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, మార్చి31: ఎమ్మెల్యే టిక్కెట్ తనకు కేటాయించకపోవడంతో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో ఉన్నారనీ, వారిలో ధైర్యం నింపేందుకు గ్రామాల్లో పర్యటిస్తానని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. జితేంద్రగౌడు తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్చార్జుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిక్కెట్టును ఎవరికి కేటాయించినా అధిష్ఠానం తమకు విషయం చెప్పాల్సి ఉందన్నారు. అధిష్ఠానం స్పందనను బట్టి తన కార్యాచరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడు, నాయకులు గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, కేశప్ప, హనుమంతు, పాల మల్లికార్జున, శివన్న, శివప్ప, గుత్తి టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జిలాన్ బాషా, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, దిల్కాశీనా పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నా

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

గుంతకల్లు, మార్చి31: టీడీపీ అధిష్ఠానం పార్టీ టిక్కెట్ కేటాయింపులో ఏకపక్షంగా వ్యవహరించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. ఆయన స్థానిక తన కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధిష్టానం ఏం చెబుతుందోనని ఎదురు చూస్తున్నానన్నారు. అనుచరుల అభీష్టం మేరకు త్వరలో కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు సంజీవరాయుడు, బోజ్జే నాయక్, మీటూనాయక్, రామకృష్ణ, రామరాజు యాదవ్, బండారు నగేశ్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అక్రమ రవాణాకు అడ్డుకట్ట: డీఎస్పీ

బొమ్మనహాళ్, మార్చి 31: ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, నగదు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం డీ.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం చెక్‌పోస్టు, బొమ్మనహాళ్ చెక్‌పోస్టులను డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమ మద్యం, నగదు రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్ణాటక నుంచి ఆంధ్రాలో ఎక్కువగా తిరిగే వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. వాహనదారుల నెంబర్లను, ప్రయాణ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలన్నారు.



బొమ్మనహాళ్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న పాస్టర్ విశ్వమోహన్

మరణంపై విజయమే ఈస్టర్

పామిడి, మార్చి 31: మరణంపై క్రీస్తు విజయమే ఈస్టర్ అని పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ పేర్కొన్నారు. మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. స్థానిక సీఎస్ఐ చర్చి ఆరాధనలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. క్రీస్తు సిలువపై మృతి చెందిన మూడవ రోజున పునరుత్థానంగా జరుపుకుంటారన్నారు. క్రీస్తు తిరిగి రావడాన్ని మరణంపై విజయంగా భావిస్తారన్నారు. క్రీస్తు పునరుత్థాన శక్తి క్రైస్తవులకు మరణంపై భయాన్ని తొలగించిందన్నారు. ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సాహాల నడుమ ఈ పండుగను జరుపుకున్నారు. ఈ ఆరాధన కార్యక్రమంలో చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, చర్చీ సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం, రత్నరాజు, దేవదాసు, అనిల్, పీటర్ విజయ్, బాలరాజు, ప్రసాద్, రజిని, మాణిక్యమ్మ, జయమ్మ, శాంతమ్మ, సుశీలమ్మ, జయామణి, ప్రిస్కిల్లా, సునాలినీ, వాణి, రేచెల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రార్థనలు

పెద్దవడుగూరు: మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలకేంద్రంలోని ఐనెక్ చర్చీలో పాస్టర్ జాన్ డేవిడ్ క్రీస్తు సందేశాన్ని వివరించారు.

వేడుకల్లో పయ్యావుల...

ఉరవకొండ : పట్టణంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఈస్టర్ వేడుకల్లో పయ్యావుల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు చూపిన మార్గంలో అందరూ నడవాలన్నారు. వజ్రకరూరు, కొనకొండ్ల గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను నిర్వహించారు.

నేను స్థానికుడినే: గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, మార్చి31: తాను గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి గ్రామంలో పుట్టానని, ఇక్కడి స్థానికుడినేనని గుంతకల్లు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఆదివారం రాత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలో దోపిడీలకు పాల్పడ్డారన్నారు. బళ్లారి రహదారిలో ఘంటసాల నగర్ వద్ద భూమిని లాగేసుకుని తన కుమార్తె పేరుపై రిజిస్టర్ చేశారన్నారు. తాను దౌర్జన్యపరుడనని దుష్ప్రచారం చేస్తున్నారని, తాను స్నేహశీలినేతప్ప దౌర్జన్యాలు చేయలేదన్నారు. గుంతకల్లులో తాను సేవా దృక్పథంతో పనిచేస్తానని, అన్ని వర్గాలవారిని నేరుగా కలసి తానేంటో, తానేం చేయదలచానో చెప్పి ఓటడుగుతానన్నారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎక్కడచూసినా ఇసుక, భూమి, మట్టి, గనులు, మద్యం అక్రమాలతో కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ప్రజల తమకు ఘనస్వాగతం పలకడంతో, వైసీపీని ఓడించాలన్న కసి కనిపిస్తోందన్నారు. కార్యకర్తలు ఈ 40 రోజులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నిరుపేదలకు సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

రాయదుర్గంటౌన్, మార్చి 31: రంజాన్ సందర్భంగా 400 మంది నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని మక్కా మసీద్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఖాజీ మహ్మద్ సైపుల్లా మరియు మున్సిపల్ కమిషనర్ కిషోర్, రాయదుర్గం అంజుమన్ అఖ్యతుల్ ఇస్లాం అధ్యక్షులు సర్మాస్, అడ్వకేట్ వాహబ్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మక్కామసీద్ యువత ఆర్గనైజేషన్ అధ్యక్షులు మహమమద్ రఫీక్, గౌరవ అధ్యక్షులు కొలిమి సలాం, మక్కా మసీద్ ముత్వల్లీ ఖలీల్, సెక్రెటరీ యునుస్, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే నిరుద్యోగులకు న్యాయం

బొమ్మనహాళ్, మార్చి 31: నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని టీడీపీ నియోజకవర్గ యువనాయకులు కాలవ భారత్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొళగానహళ్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ పేరుతో సీఎం జగన్ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. బీసీ వర్గాల రక్షణ సంక్షేమమే చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారని టీడీపీ నాయకులు సప్తగిరి సత్యనారాయణ పేర్కొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, మాజీ కన్వీనర్ చలపతి, టీడీపీ నాయకులు కొత్తపల్లి మహేంద్ర, సైకిల్‌షాప్ హనుమంతు, కావలి రాము, సల్లాపురం బాబు, పయ్యావుల నాగరాజు, రవిచంద్రసాగర్ పాల్గొన్నారు.

గన్‌ఫైరింగ్‌లో విజేత కేటీఎస్ విద్యార్థి

రాయదుర్గంరూరల్, మార్చి 31: స్థానిక కేటీఎస్ కళాశాల విద్యార్థి గన్‌ఫైరింగ్‌లో ప్రతిభ చూపారు. ఎన్‌సీసీ క్యాండేట్ కే హేమంత్ అనంతపురంలో జరిగిన ఎన్‌సీసీ ఇంటర్ కాలేజీ ఫైరింగ్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆదివారం తెలిపారు. విద్యార్థి ఎంపికపై ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ జే కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

గరుడవాహనంపై లక్ష్మీరమణుడు

యల్లనూరు, మార్చి31: మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించి గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

డీ.హీరేహాళ్, మార్చి 31: మండలంలోని ఓ గ్రామంలో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఆదివారం నాడు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన లోకేష్ అనే వ్యక్తి ఎవరూ లేని సమయంలో ఆ మహిళ చెయ్యి పట్టుకుపోయాడని ఇంతలోనే మేల్కొన్న ఆ మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు ప్రక్కల వారు అక్కడికి వచ్చేసరికి ఆ వ్యక్తి పారిపోయాడని తెలిపారు. మహిళ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

రెండు హోటళ్లలో చోరీ

గుత్తి,మార్చి31: పట్టణంలోని రెండు హోటళ్లల్లో చోరీ జరిగింది. అనంతపురం రోడ్డు గోల్డెన్ కేఫ్, టీటైం అనే రెండు హోటళ్లలో గుర్తు తెలియని దుండుగులు శనివారం రాత్రి చోరీలకు పాల్పడ్డారు. దాదాపు రూ.25వేలు విలువ చేసే సిగరేట్లు, రూ.10వేలను అపహరించారని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రిటౌన్, మార్చి31: మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో ఆదివారం ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల మేరకు ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.29,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి వెంకటేశ్వరరెడ్డి, చెన్నప్ప, శివప్రసాద్, హాజివలి, బాలకృష్ణారెడ్డి, దస్తగిరి, చిన్న ఓబులేసులను అరెస్ట్ చేశామన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడు మృతి



ఆనంద్ నాయక్ (ఫైల్)

బెళుగుప్ప, మార్చి 31 : మండలంలోని బెళుగుప్ప తండాకు చెందిన టీడీపీ నాయకులు ఆనంద నాయక్ (44) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పయ్యావుల శ్రీనివాసులు రూ. పది వేల రూపాయల ఆర్థికసాయం అందించగా నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున, కంచిరాముడు, విజ్జి, ప్రభాకర్ నాయక్, లక్ష్మీబాయిలు పరామర్శించి కుటుంబ సభ్యులకు నగదు అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య నీలావతి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

యల్లనూరు, మార్చి31: మండలంలో వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్‌లో మార్పులు చేసినట్లు ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. యల్లనూరు, తిరుమలాపురం ఫీడర్‌కు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కొండాపురం, పెద్దమల్లేపల్లి ఫీడర్‌కు మధ్యాహ్నం 2గంటల నుంచి 6గంటల వరకు తిరిగి రాత్రి 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు తెలిపారు. సవరించిన విద్యుత్ వేళలను రైతులు గమనించాలని ఆయన కోరారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఎన్నికల బాండ్లు

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లప్ప

గుంతకల్లుటౌన్,మార్చి31: ఎన్నికల బాండ్లు ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లప్ప విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సీపీఎం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విరాళాలు పొందడం కోసమే బీజేపీ అధికారాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో పెట్టిన ఎన్నికల బాండ్ల రెండు జాబితాల ప్రకారం రూ. 16,492కోట్ల విరాళాలు వివిధ రాజకీయ పార్టీల ఖాతాలకు చేరాయన్నారు. ఇందులో ఒక్క బీజేపీకి రూ. 8,250కోట్లు దక్కాయన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డీ శ్రీనివాసులు, బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతిప్రసాద్, కసాపురం రమేష్, రామునాయక్, ఓబులేసు, అబ్దుల్లా, షాషా, జ్యోతి, పాల్గొన్నారు.

గుత్తికి బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు

పామిడి, మార్చి 31: గుంతకల్లు టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తొలిసారిగా జిల్లాకు రానుండంతో స్వాగతం పలికేందుకు తెలుగు తమ్ముళ్లు పెద్దఎత్తున తరలివెళ్లారు. పామిడి సహా సమీప గ్రామాల టీడీపీ అభిమానులు పెద్దఎత్తున గుత్తికి తరలివెళ్లారు.